రూట్ మార్చిన టీం ఇండియా..

ముంబయి : గత మ్యాచ్‌లో బ్యాటింగ్ ఆర్డర్‌లో మార్పులు చేసి ఘోరా విఫలాన్ని చవి చూసిన టీం ఇండియా ఈ సారి తమ ప్లాన్‌లో ఛేంజస్ చేసినట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించి రోహిత్ శర్మ కీలక సంకేతాలు పంపినట్లు కూడా జోరుగా ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో అతడి స్థానం మరికొంత పైకి జరిగే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. తాజాగా నెట్స్ సెషన్‌లో జరిగిన మార్పులే దీనికి సంకేతమని క్రిటిక్స్ అంటున్నారు.

సాధారణంగా కొత్త బంతిని ఎదుర్కొనేందుకు నెట్‌స్‌లో ఓపెనర్లు వస్తుంటారు. అయితే బ్రిస్బేన్‌లో తాజాగా జరిగిన సెషన్‌లలో రోహిత్ కూడా బంతి మెరుపు కోల్పోని సమయంలోనే ప్రాక్టీస్ చేశాడు. సిరాజ్, బుమ్రా, ఆకాశ్‌దీప్‌లు రోహిత్‌కు బౌలింగ్ చేశారు. దీంతోపాటు జైస్వాల్, జడేజాతో కొన్ని విషయాల గురించి చర్చించాడట. మరోవైపు విరాట్ కూడా ఎక్కువసేపు నెట్స్ సెషన్‌లో పాల్గొన్నాడని తెలుస్తోంది.

ఇదిలా ఉండగా, ఈ సెషన్స్ మొత్తం తన కోచింగ్ బృందంతో కలిసి పర్యవేక్షించాడు హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్. అయితే ఆ సమయంలో ఆయన విరాట్‌తో ఏదో విషయం గురించి సుదీర్ఘంగా చర్చించినట్లు తెలుస్తోంది. ఆ తర్వాత జట్టు మొత్తం ఫీల్డింగ్ డ్రిల్స్ చేసింది.

అయితే రోహిత్ టెస్ట్‌ల్లో బ్యాటింగ్‌కు తీవ్రంగా ఇబ్బందిపడుతున్నాడు. గత 12 మ్యాచ్‌ల్లో కేవలం ఒక్క అర్ధశతకం మాత్రమే నమోదు చేయగలిగాడు. మిగతా ఎనిమిది సార్లు పది పరుగుల్లోపే చేశాడు. పర్సనల్ కారణాల వల్ల ఆస్ట్రేలియా సిరీస్ తొలి టెస్ట్‌లో అతడు ఆడలేకపోయాడు. దీంతో జైస్వాల్, రాహుల్ ఆ ఇన్నింగ్స్‌ను ప్రారంభించారు. వారిద్దరూ మ్యాచ్ విజయంలో కీలక పాత్ర పోషించారు. ఈ క్రమంలోనే రెండో టెస్ట్ కోసం ఈ జంటను కొనసాగించి రోహిత్ 6వ స్థానంలో బ్యాటింగ్‌కు దిగాడు. అయితే అప్పుడు అతడు ఘోరంగా విఫలం అయ్యాడు.

అటు రాహుల్ కూడా పెద్దగా మెరుపులు సృష్టించలేకపోయాడు. దీంతో రానున్న మ్యాచ్‌లో సీమర్లకు స్వర్గధామమైన గబ్బా మైదానంలో రోహితే ఇన్నింగ్స్‌ను ప్రారంభించవచ్చని ప్రచారం జరుగుతోంది. సీమర్లను ఎదుర్కోవడంలో అతడికి ఉన్న అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని జట్టు ఈ వ్యూహాన్ని అనుసరించే అవకాశం ఉన్నట్లు సమాచారం. అయితే సుమారు 30 ఏళ్లకు పైగా ఆసీస్‌కు ఓటమనేదే లేకుండా కొనసాగిన మైదానం గబ్బా. ఈ రికార్డును 2021లో రిషభ్ పంత్ అద్భుతమైన బ్యాటింగ్‌తో బద్దలు కొట్టాడన్న సంగతి మన అందరికీ తెలిసిందే. చూడాలి మరి ఈ సారి మనోళ్ల వ్యూహం ఏమేరకు ఫలిస్తుందో చూడాలి.

గబ్బా టెస్ట్‌కు వర్షం ముప్పు !

విశ్వంభర, క్రీడావిభాగం : బోర్డర్ గావస్కర్ ట్రోఫీలో భాగంగా టీమ్ ఇండియా, ఆస్ట్రేలియా మధ్య మూడో టెస్టు డిసెంబర్ 14న గబ్బా వేదికగా మొదలు కానుంది. అయితే ఈ మ్యాచ్‌లో ఎలాగైనా గెలిచి కమ్‌బ్యాక్ ఇవ్వాలని భారత జట్టు భావిస్తుంటే, ఆస్ట్రేలియా జట్టు తమ జోరును కొనసాగించాలని పట్టుదలతో ఉంది. ఎందుకంటే ఈ ట్రోఫీలో భాగంగా ఇప్పటికే జరిగిన తొలి టెస్ట్‌లో టీమ్ ఇండియా విజయం సాధించగా, రెండో మ్యాచ్‌లో కంగారులు గెలిచారు. పైగా ఈ గబ్బా వేదికపై 1988 నుంచి 2021 వరకు ఆసీస్ జట్టుకు అసలు ఓటమనేదే తెలీదు. కానీ 2020 21లో మాత్రం వారి విజయాల రికార్డును టీమ్ ఇండియా బ్రేక్ చేసింది. దీంతో ఇప్పుడు మూడు టెస్ట్‌లో గెలువాలని ఇరు జట్లు గట్టి పట్టుదలతో ఉన్నాయి. అయితే ఇప్పుడు ఈ మ్యాచ్‌కు వరుణుడు అంతరాయం కలిగించే అవకాశముందని తెలుస్తోంది. ఇప్పటికే గత రెండు రోజుల నుంచి బ్రిస్బేన్‌లో భారీ వర్షాలు కురుస్తున్నట్లు తెలుస్తోంది. పూర్తి స్థాయిలో మూడో టెస్టు మ్యాచ్ జరగడం కష్టమని పలు రిపోర్ట్‌లు చెబుతున్నాయి.

భారత కాలమానం ప్రకారం ఉదయం 5.50 గంటల నుంచి మ్యాచ్ మొదలు అవుతుంది. అయితే ఈ టెస్ట్ మ్యాచ్ జరగనున్న ఐదు రోజుల్లోనూ వర్షం కురిసే ఛాన్స్ ఉన్నట్లు తెలిసింది. మొదటి రోజు 88 శాతం వర్షం పడే ఛాన్స్ ఉందని, అలానే రెండు, నాలుగు రోజుల్లో 40 శాతం కురిసే అవకాశం ఉందని అంటున్నారు. ఇక 3, 5 రోజుల్లో 20 శాతం కురవచ్చని చెబుతున్నారు.

దీంతో భారత అభిమానులు ఆందోళన చెందుతున్నారు. ఎందుకంటే ఈ మ్యాచ్ భారత్‌కు ఎంతో కీలకం. డబ్ల్యూటీసీ ఫైనల్ ఆశలను సజీవంగా ఉంచుకోవాలంటే ఈ గబ్బా టెస్టులో టీమ్ ఇండియా గెలవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

పిచ్ ఎలా ఉందంటే? తాజాగా జరగబోయే మూడో టెస్టులోనూ టీమ్‌ఇండియాకు పేస్ పరీక్ష తప్పదు. క్రిస్మస్ తర్వాత కాకుండా వేసవి ఆరంభం (ఆస్ట్రేలియాలో) మ్యాచ్ జరుగుతున్నందున మ్యాచ్ వేదిక అయిన గబ్బాలోపిచ్ ఎప్పటిలాగే పేస్, బౌన్స్‌కు సహకరించనుంది. గత సారి పంత్ సూపర్ ఇన్నింగ్స్‌తో గబ్బాలో భారత్ అద్భుత విజయాన్నందుకుంది. అయితే ఆ మ్యాచ్ (నాలుగో టెస్టు) జనవరిలో జరిగింది. 1988 తర్వాత గబ్బాలో ఓడిపోవడం ఆస్ట్రేలియాకు అదే తొలిసారి. ఈ నేపథ్యంలోనే ఇప్పుడు గబ్బా మ్యాచ్‌ను ఆస్ట్రేలియా త్వరగా నిర్వహిస్తోంది.

కాగా తొలి టెస్టులో 295 పరుగుల తేడాతో భారత జట్టు ఘన విజయం సాధించగా, రెండో మ్యాచులో ఆతిథ్య జట్టు ఆసీస్ 10 వికెట్ల తేడాతో భారత్‌ను ఓడించింది. దీంతో ప్రస్తుతం ఐదు మ్యాచ్‌ల సిరీస్ 11తో సమంగా నిలిచింది.

ఆ కుర్రాడే అత్యుత్తమ ప్లేయర్: రికీ పాంటింగ్

విశ్వంభర, క్రీడావిభాగం : దశాబ్దానికిపైగా సత్తాచాటిన విరాట్ కోహ్లి, కేన్ విలియమ్సన్, జో రూట్, స్టీవ్ స్మిత్‌లను క్రికెట్ ప్రపంచం ఫ్యాబ్ 4గా పిలుస్తుంటుంది. అత్యుత్తమ క్రికెటర్ అనే ప్రశ్నకు ఈ నలుగురిలో ఒక్కరి పేరే అత్యధికంగా జవాబుగా వినిపిస్తుంటుంది. అంతటి రీతిలో క్రికెట్ క్షేత్రంలో ఈ యోధులు సత్తా చాటారు. అయితే ఆస్ట్రేలియా దిగ్గజ క్రికెటర్ రికీ పాంటింగ్ అత్యుత్తమ క్రికెటర్ అంటూ కుర్రాడు పేరు చెప్పాడు. ప్రస్తుతం టెస్టుల్లో అత్యుత్తమ క్రికెటర్ ఇంగ్లండ్ ప్లేయర్ హ్యారీ బ్రూక్ అని పాంటింగ్ పేర్కొన్నాడు. ఫ్యాబ్ 4 కాకుండా తొలిసారి కొత్త పేరు తెరపైకి వచ్చింది. 25 ఏళ్ల ఇటీవల బ్రూక్ ఇటీవల టెస్టు బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానానికి ఎగబాకాడు. జులై నుంచి టెస్టుల్లో నంబర్ వన్ బ్యాటర్‌గా కొనసాగుతున్న జో రూట్‌ను అధిగమించి ఒక్క పాయింట్ ఆధిక్యంతో బ్రూక్ అగ్రస్థానానికి చేరాడు.

''ప్రస్తుత టెస్టు బ్యాటర్లలో హ్యారీ బ్రూక్ అత్యుత్తమ ప్లేయర్‌గా భావిస్తున్నా. అతను చక్కని ఇన్నింగ్స్‌లు ఆడుతున్నాడు. సొంతగడ్డతో పాటు విదేశాల్లో గొప్ప ప్రదర్శన చేస్తున్నాడు. అతను సాధించిన ఎనిమిది తొమ్మిది సెంచరీల్లో విదేశాల్లో ఏడు శతకాలు విదేశాల్లోనే బాదడం విశేషం. అతను పరుగులు సాధించే విధానం, క్లాస్‌ను ఎంతో ఆస్వాదిస్తున్నాను. జనరేషనల్ ప్లేయర్ అయిన అతన్ని గత ఐపీఎల్ వేలంలో దక్కించుకున్నాను. ప్రస్తుత టెస్టు ఫార్మాట్‌లో సత్తాచాటుతున్న బ్రూక్ అన్ని ఫార్మాట్లలోనూ అదరగొట్టగలడు'' అని రికీ పాంటింగ్ అన్నాడు.

గత కొంతకాలంగా అద్భుత ఫామ్ కొనసాగిస్తున్న హ్యారీ బ్రూక్ శతకాలు సాధిస్తున్నాడు. 23 టెస్టులు ఆడిన బ్రూక్ 61.62 సగటుతో 2280 పరుగులు చేశాడు. ఎనిమిది సెంచరీలు, 10 హాఫ్ సెంచరీలు సాధించాడు. ఓ డబుల్ సెంచరీ కూడా బాదాడు. ఈ నేపథ్యంలో మాజీ క్రికెటర్ల నుంచి బ్రూక్ ప్రశంసలు అందుకుంటున్నాడు. గత ఐపీఎల్ వేలంలో బ్రూక్‌ను ఢిల్లీ క్యాపిటల్స్ సొంతం చేసుకుంది. అప్పటి ఢిల్లీ కోచ్‌గా పాంటింగ్ ఉన్న సంగతి తెలిసిందే.

ఛాంపియన్స్ ట్రోఫీ ఫార్మాట్‌లో భారీ మార్పు

విశ్వంభర, క్రీడావిభాగం : ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025 నిర్వహణపై సందిగ్ధత కొనసాగుతోంది. ఛాంపియన్స్ ట్రోఫీ కోసం పాకిస్థాన్‌కు ఎట్టి పరిస్థితుల్లో భారత జట్టును పంపబోమని బీసీసీఐ ఇప్పటికే స్పష్టం చేసింది. మరోవైపు, టోర్నీని హైబ్రిడ్ మోడల్‌లో నిర్వహించే విషయంపై పీసీబీ తన స్పష్టమైన వైఖరిని ఇప్పటికీ అధికారికంగా తెలియజేయలేదు.

దీంతో ఇప్పటికీ ఛాంపియన్స్ ట్రోఫీ షెడ్యూల్ ఖరారు కాలేదు. పైగా టోర్నీకి సమయం దగ్గర పడుతున్నందున మార్కెటింగ్ చేసుకోలేకపోతున్నామని ప్రసారకర్తలు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో మెగా టోర్నీని టీ20 ఫార్మాట్‌లో నిర్వహించాలని ఐసీసీకి ప్రతిపాదనలు వచ్చినట్లు క్రిక్‌బజ్ రిపోర్ట్ ద్వారా తెలుస్తోంది. వన్డే ఫార్మాట్ కన్నా టీ20లకు ఆదరణ ఎక్కువ లభిస్తుండడం వల్ల పొట్టి ఫార్మాట్‌లో ఛాంపియన్స్ ట్రోఫీ నిర్వహించాలనే యోచనలో ఐసీసీ కూడా ఉన్నట్లు సమాచారం.

"ప్రతి ష్టం భన కొనసాగితే ఛాంపియన్స్ ట్రోఫీని టీ20 ఫార్మాట్‌గా మార్చాలని కొంతమంది వాటాదారులు కోరే అవకాశం ఉంది. వన్డేలకు రానురాను ఆదరణ తగ్గిపోతుంది. టోర్నీని టీ20 ఫార్మాట్‌గా మార్చితే సులభంగా, వేగంగా మార్కెటింగ్ చేసుకోవచ్చు" అని క్రికెట్ సంబంధిత వర్గాలు తెలిపాయి.

కోహ్లీ, రోహిత్‌కు షాక్!

మార్కెటింగ్ వంటి ఆర్థిక పరమైన ఇబ్బందుల కారణంగా టీ20 ఫార్మాట్‌లో ఛాంపియన్స్ ట్రోఫీ నిర్వహిస్తే రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ వంటి స్టార్ ప్లేయర్లకు బిగ్ షాక్ తగలుతుంది!. ఛాంపియన్స్ ట్రోఫీని గెలిచి మరో ఐసీసీ ట్రోఫీని ముద్దాడాలనుకున్న వాళ్ల ఆశలకు బ్రేక్ పడుతుంది. ఎందుకంటే టీ20 వరల్డ్ కప్ 2024 విజయానంతరం ఈ ఇద్దరూ పొట్టి ఫార్మాట్‌కు. రిటైర్మెంట్ ప్రకటించారు. దీంతో వాళ్లు ఛాంపియన్స్ ట్రోఫీని ఆడే అవకాశం ఉండకపోవచ్చు!

ఐసీసీ నిర్ణయంపై ఉత్కంఠ

కాగా, వచ్చే ఏడాది పాకిస్థాన్ వేదికగా ఛాంపియన్స్ ట్రోఫీ జరగాల్సి ఉంది. తాము ఆడే మ్యాచ్‌లను తటస్థ వేదికలకు మార్చి హైబ్రిడ్ మోడల్‌లో టోర్నీని నిర్వహించాలని ఐసీసీకి బీసీసీఐ స్పష్టం చేసింది. పాకిస్థాన్ కూడా హైబ్రిడ్ మోడల్‌కు అంగీకరిస్తుందనే అంతా అనుకుంటున్నారు. అయితే, భవిష్యత్తులో భారత్‌లో జరిగే ఐసీసీ ఈవెంట్లలో తమ మ్యాచ్‌లకూ ఇదే మోడల్‌ను అనుసరించాలని ఇప్పటికే పాక్ బోర్డు, ఐసీసీ దృష్టికి తీసుకొచ్చింది. దీనిపై ఐసీసీ ఏ నిర్ణయం తీసుకుంటుందో చూడాలి.

టీమిండియా వైస్ కెప్టెన్ ఖాతాలో మరో రికార్డు

విశ్వంభర, క్రీడావిభాగం : టీమిండియా స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన(109 బంతుల్లో 14 ఫోర్లు, సిక్స్‌తో 105) చరిత్ర సృష్టించింది. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా ఆస్ట్రేలియాతో బుధవారం జరిగిన మూడో వన్డేలో సెంచరీ చేయడం ద్వారా స్మృతి మంధాన అరుదైన ఘనతను అందుకుంది. ఒకే క్యాలెండర్ ఇయర్‌లో నాలుగు వన్డే సెంచరీలు చేసిన తొలి మహిళా బ్యాటర్‌గా చరిత్రకెక్కింది. బెలిండా క్లార్క్(1997), మెగ్ లానింగ్(2016), అమీ సాటర్త్ వైట్(2016), సోఫీ డివైన్(2018), సిద్రా అమిన్(2012), నాట్ సివర్(2023), లారా వోల్వార్ట్(2024) ఒకే క్యాలెండర్ ఇయర్‌లో మూడేసి సెంచరీలు బాదారు. ఈ ఏడాది నాలుగు శతకాలు నమోదు చేసిన స్మృతి మంధాన ఈ ఘనతను అందుకున్న తొలి బ్యాటర్‌గా చరిత్రకెక్కింది. ఇక స్మృతి మంధానకు ఇది 9వ వన్డే శతకం. ఈ క్రమంలోనే అత్యధిక సెంచరీలు నమోదు చేసిన తొలి ఆసియా బ్యాటర్‌గా శ్రీలంక ప్లేయర్ చమరి ఆటపట్టు రికార్డ్‌ను సమం చేసింది.

ఈ మ్యాచ్‌లో మంధాన సెంచరీతో మెరిసినా భారత్‌కు విజయం దక్కలేదు. దాంతో ఆస్ట్రేలియా పర్యటనను భారత మహిళల జట్టు ఘోర పరాజయంతో ముగించింది. మూడు వన్డేల సిరీస్ కోసం ఆసీస్ పర్యటనకు వచ్చిన హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని భారత జట్టు 03తో క్లీన్ స్వీప్‌కు గురైంది. బుధవారం ముగిసిన మూడో వన్డేలో ఆస్ట్రేలియా 83 పరుగుల తేడాతో భారత జట్టును ఓడించింది.

ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా మహిళల జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్లకు 298 పరుగులు చేసింది. అన్నాబెల్ సదర్లాండ్(95 బంతుల్లో 9 ఫోర్లు, 4 సిక్స్‌లతో 110) శతకంతో సత్తా చాటగా.. ఆష్లీ గార్డ్‌నర్(64 బంతుల్లో 5 ఫోర్లతో 50), తహిలా మెక్‌గ్రాత్(50 బంతుల్లో 5 ఫోర్లతో 56 నాటౌట్) హాఫ్ సెంచరీలతో రాణించారు.

భారత బౌలర్లలో తెలుగు తేజం అరుంధతి రెడ్డి(4/26) నాలుగు వికెట్లు తీయగా.. దీప్తి శర్మ ఓ వికెట్ తీసింది. అనంతరం లక్ష్యచేధనకు దిగిన భారత మహిళల జట్టు 45.1 ఓవర్లలో 215 పరుగులకు కుప్పకూలింది. స్మృతి మంధాన మినహా మరే బ్యాటర్ రాణించలేదు. హర్లీన్ డియోల్(64 బంతుల్లో 4 ఫోర్లతో 39) కాస్త పర్వలేదనిపించింది.

ఆస్ట్రేలియా బౌలర్లలో ఆష్లే గార్డ్‌నర్(5/30) ఐదు వికెట్లు తీయగా.. మేఘన్ స్కట్, అలనా కింగ్ తలో రెండు వికెట్లు తీసారు. అన్నబెల్ సదర్లాండ్‌కు ఓ వికెట్ దక్కింది.

టయోటా క్యామ్రీ లాంచ్

విశ్వంభర, బిజినెస్ : ఇండియన్ మార్కెట్లోకి మరో లగ్జరీ కారు ఎంట్రీ ఇచ్చింది. ప్రముఖ కార్ల తయారీ సంస్థ టయోటా కిర్లోస్కర్ మోటార్ భారతదేశంలో తన ప్రీమియం సెడాన్ కారును విడుదల చేసింది. ఈ కారు ఏడాది క్రితమే విదేశీ మార్కెట్లో రిలీజ్ అయి మంచి ప్రజాదరణ పొందింది. దీంతో ఈ కారును కంపెనీ భారత మార్కెట్లోకి కూడా తీసుకొచ్చింది. పెట్రోల్ హైబ్రిడ్ ఇంజిన్‌తో ఈ తొమ్మిదో తరం క్యామ్రీ మోడల్‌ను కంపెనీ.. స్టన్నింగ్ డిజైన్, అధునాతన టెక్నాలజీతో తీసుకొచ్చింది. మరెందుకు ఆలస్యం దీని ధర, ఫీచర్లపై ఓ లుక్కేద్దాం..

ఎక్స్‌టీరియర్: ఈ టయోటా క్యామ్రీ కారు సరికొత్త డిజైన్‌తో ఎంట్రీ ఇచ్చింది. దీని స్టైల్, డిజైన్ దాని ప్రీవియస్ మోడల్ కంటే చాలా భిన్నంగా ఉంది. ఎక్స్‌టీరియర్ పరంగా చూస్తే.. దీన్ని హ్యామర్ హెడ్ స్టైలింగ్‌తో రూపొందించారు. అంతేకాక దీనిలో హైటెక్ ఫీచర్లతో సహా అనేక మార్పులు చేశారు. దీనిలోని రివైజ్డ్ ఫ్రంట్ ఫాసియా, హారిజాంటల్ స్లాట్లతో వైడ్ అండ్ అగ్రెసివ్ గ్రిల్, C షేప్డ్ LED DRLs, కొత్త మల్టీస్పోక్ అల్లాయ్ వీల్స్ సెట్, డోర్ ప్యానెల్స్‌పై షార్ప్ క్రీసెస్, స్లిమ్ LED హెడ్ ల్యాంప్స్, డేటైమ్ రన్నింగ్ లైట్‌లతో పాటు లార్జ్ పనోరమిక్ సన్ రూఫ్ వంటి వాటిని అప్‌డేట్ చేశారు. ఈ కారు ముందు భాగంలో గ్రిల్.. తేనెపట్టు ఆకారంలో ఉన్న ప్యాటెర్న్‌ను కలిగి ఉంది.

ఇంటీరియర్: దీని ఇంటీరియర్ గురించి చెప్పాలంటే.. ఇది డ్యూయల్‌టోన్ థీమ్, త్రీస్పోక్ మల్టీఫంక్షన్ స్టీరింగ్ వీల్, 10అంగుళాల హెడ్‌అప్ డిస్‌ప్లే, 12.3అంగుళాల స్క్రీన్‌తో టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్, 360డిగ్రీ కెమెరా, మల్టీ జోన్ క్లైమేట్ కంట్రోల్, 9 స్పీకర్ జేబీఎల్ సౌండ్ సిస్టమ్ వంటి ఫీచర్లతో అధునాతన ADAS సూట్‌తో వస్తుంది.

పవర్‌ట్రెయిన్: కంపెనీ ఈ కొత్త టయోటా క్యామ్రీ కారులో ప్రీవియస్ మోడల్ మాదిరిగానే 2.5లీటర్ పెట్రోల్ ఇంజిన్‌ను అందించింది. అయితే ఈసారి దీన్ని హైబ్రిడ్ మోటార్ సెటప్‌తో తీసుకొచ్చింది. ఇది టయోటా ఐదో జనరేషన్ కారులో హైబ్రిడ్ సిస్టమ్ (THS 5) ను కలిగి ఉంటుంది. ఈ మార్పుతో కంపెనీ కారు కంబైన్డ్ పవర్‌ను 4 శాతం పెంచింది. ఇది 3200rpm వద్ద 221 Nm టార్క్‌ను జనరేట్ చేస్తుంది. స్పోర్ట్స్, ఎకో డ్రైవింగ్ మోడ్‌స్‌తో వస్తోంది. లీటర్‌కు 25.4 కిలోమీటర్ల మైలేజ్ ఇస్తుందని కంపెనీ చెబుతోంది.

eCVT గేర్‌బాక్స్: కొత్త టయోటా క్యామ్రీ ఇప్పుడు గరిష్టంగా 230hp శక్తిని కలిగి ఉంటుంది. ఈ పవర్ మునుపటి వెర్షన్ టయోటా క్యామ్రీ పవర్ కంటే 12hp ఎక్కువ. ఇది మాత్రమే కాకుండా కొత్త హైబ్రిడ్ సిస్టమ్ కారు మైలేజీని కూడా మెరుగుపరిచింది. అదే సమయంలో కంపెనీ దీనికి eCVT గేర్‌బాక్స్‌ను అందించింది.

పీఎఫ్ ఖాతాదారులకు గుడ్‌న్యూస్..

ఇక ఏటీఎం ద్వారా నగదు విత్‌డ్రా

విశ్వంభర, బిజినెస్ : పీఎఫ్ ఖాతాదారులకు గుడ్ న్యూస్. త్వరలోనే ఉద్యోగ భవిష్యనిధి సొమ్ము ఉపసంహరణ మరింత తేలిక కానుంది. ఈపీఎఫ్‌ఓ చందాదారులు నేరుగా ఏటీఎంల ద్వారా తమ పీఎఫ్‌ను విత్ డ్రా చేసుకునే అవకాశం త్వరలోనే కల్పించనున్నట్లు కార్మికశాఖ కార్యదర్శి సుమిత దావ్రా వెల్లడించారు. కార్మికులకు మెరుగైన సేవల కోసం కార్మిక మంత్రిత్వ శాఖ తన ఐటీ వ్యవస్థలను అప్‌గ్రేడ్ చేస్తోందని ఆయన అన్నారు. క్లెయిమ్‌లు వేగంగా పరిష్కరిస్తున్నామన్న ఆమె చందాదారులు, లబ్దిదారులు ఏటీఎంల ద్వారా నగదును సులభంగా పొందవచ్చని అన్నారు. వచ్చే ఏడాది జనవరి నుంచే ఈ సేవలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని సమాచారం.

"చందాదారులకు మెరుగైన సేవలను అందించేందుకు సాంకేతిక వ్యవస్థలను అభివృద్ధి చేస్తున్నాం. ప్రతి రెండు, మూడు నెలలకు ఒకసారి ఇందులో పురోగతి గమనించవచ్చు. జనవరి 2025 నాటికి మరిన్ని మార్పులు వస్తాయని ఆశిస్తున్నాను" అని కార్మికశాఖ కార్యదర్శి సుమిత దావ్రా పేర్కొన్నారు. ఈపీఎఫ్‌వో సేవలను మరింత మెరుగుపరచడం సహా, ఖాతాదారుల జీవన సౌలభ్యాన్ని మరింత పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

తగ్గనున్న పెట్రోల్, డీజిల్ ధరలు

విశ్వంభర, బిజినెస్ : ప్రస్తుతం ప్రజల నిత్యావసర ఖర్చుల్లో ఎక్కువగా పెట్రోల్, డీజిల్ ఖర్చులకే ఎక్కువ కేటాయించాల్సిన పరిస్థితి నెలకొంది. వీటి ధరలు రెగ్యులర్ గా పెరుగుతుండటంతో ప్రజా రవాణా భారంగా మారుతోంది. ఈ క్రమంలో పెట్రోల్, డీజిల్‌ను తక్కువ ధరలకు అందుబాటులోకి తీసుకొచ్చి, ప్రజలపై ఆర్థిక ఒత్తిడిని తగ్గించే లక్ష్యంతో కేంద్రం సన్నాహాలు ప్రారంభించింది. దేశీయంగా ఉత్పత్తి చేస్తున్న ముడి చమురుపై విధిస్తున్న విండ్‌ఫాల్ ట్యాక్స్‌ను రద్దు చేస్తూ కీలక నిర్ణయం తీసుకోవడంతో రానున్న కొద్దిరోజుల్లోనే పెట్రోల్, డీజిల్ ధరల్లో భారీ మార్పు కనిపించవచ్చని, ఈ ధరలు బాగా దిగొచ్చే అవకాశం ఉందని నిపుణులు అంటున్నారు. ప్రభుత్వం చివరిసారిగా మార్చిలో ఇంధన ధరలను రూ.2లు తగ్గించింది. అప్పటి నుంచి అవే ధరలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మరోసారి ధరలు తగ్గిస్తే.. సామాన్యులకు ఇంటి, వ్యాపార ఖర్చులు కాస్త తగ్గి, ఉపశమనం కలిగే అవకాశం ఉంది.